క్లుప్తంగా

పోరాటాలకు సిద్ధమవ్వండి

బూర్గంపాడు: భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పరిరక్షించేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.కోటం రాజు పిలుపునిచ్చారు. సారపాకలో నూతనంగా నిర్మించిన మండల పెయింటర్స్ యూనియన్ నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం ఖర్చుచేయాల్సిన నిధులను ప్రభుత్వం దొడ్డిదారిన దారి మళ్లిస్తోందన్నారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని, సహజ మరణానికి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఉప్పతల నర్సింహారావు, బత్తుల వెంకటేశ్వర్లు, సెగ్గెం శ్రీనివాస్, తోట మల్లయ్య, సీహెచ్ రమణయ్య, ఓర్సు పండు, నూనె వెంకన్న, ప్రేమ్ చంద్, కోటయ్య, పెరిక స్వామి పాల్గొన్నారు.

ఖాళీ చేయించడం సరికాదు


మాట్లాడుతున్న అమర్లపూడి రాము

దమ్మపేట: గత కొద్ది సంవత్సరాలుగా ప్రాథమిక నిర్మాణ దశలోనే ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పేదలు ఆవాసాలుగా మార్చుకోగా.. వారిని బలవంతంగా ఖాళీ చేయించడం సరికాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అమర్లపూడి రాము మాట్లాడుతూ.. మండలంలోని మల్లారం శివారులోని అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలను ఆవాసాలుగా చేసుకుని నివాసం ఉంటున్న పేదలను పోలీసులతో బలవంతంగా ఖాళీ చేయించడాన్ని, ప్రభుత్వ దుశ్చర్యగా అభివర్ణించారు. ఖాళీ చేయించిన నిరుపేదలకు ప్రభుత్వమే స్థలాలతో పాటుగా ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తొడెం దుర్గమ్మ, పండూరి వీరబాబు, అనిల్ కుమార్, జగదీష్, శంకర్, నాగమణి, ముక్తేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దమ్మపేట: సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ.. ఆ పార్టీ నాయకులు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆదివారం మండలంలోని మొద్దులగూడెంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభలకు మండల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటుగా అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాసరావు, కొలికపోగు శ్రీనివాసరావు, నబి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పలువురు సీనియర్ నాయకులను బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. దమ్మపేట గ్రామానికి చెందిన కక్కిరాల రత్నాకర్‌రావు కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా.. మాజీ ఎమ్మెల్యే మెచ్చా ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పోతినేని వెంకట్రావును పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, జలగం వాసు అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీను, పాకనాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర

మణుగూరుటౌన్: బీటీపీఎస్–ఏటూరు నాగారం ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర ప్రారంభించానని సామాజిక కార్యకర్త కర్నె రవి అన్నారు. ఆదివారం తిర్లాపురం పంచాయతీ సమీపంలోని సమ్మక్కసారలమ్మ ఆలయ సమీపంలో జరిగిన పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రోడ్లు డ్రెయినేజీలు ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నారు. మణుగూరు పరిధిలోని గిరిజనులకు గిరిజన పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ రైల్వే ట్రాక్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేసి మణుగూరు అభివృద్ధి చేయాలని కోరారు. సింగరేణి, బీటీపీఎస్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ప్రజాప్రతినిధులను కోరారు. అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు మద్దతు తెలిపాయి.

సరిహద్దులో గంజాయి రవాణా

- దుమ్ముగూడెం శివారు గ్రామాల మీదుగా ఎగుమతి
- వరుసగా పట్టుబడుతున్న మాదకద్రవ్యం
- స్థానికంగానూ పెరుగుతున్న వినియోగం


వాహన తనిఖీలో పట్టుబడిన గంజాయితో పోలీసులు (ఫైల్)

దుమ్ముగూడెం: గంజాయి రవాణాకు మండల సరిహద్దు ప్రాంతం అడ్డాగా మారింది. గత కొంత కాలంగా సరిహద్దు గ్రామాల నుంచి గంజాయిని స్మగ్లర్లు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. వరుసగా మండల పోలీసులు గంజాయి పట్టుకుటుండంటంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. ఒరిస్సా ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని వస్తున్న స్మగ్లర్లు, మండలంలోని కొత్తపల్లి గ్రామం నుండి ఎంటరై మారాయిగూడెం, అర్లగూడెం నుంచి ములకపాడు మీదుగా చర్ల–భద్రాచలం ప్రధాన రహదారి మీదుగా పట్టణాలకు రవాణా చేస్తున్నారు. భద్రాచలం పట్టణంలో పోలీసులు, ఎక్సైజ్ పోలీసుల నిఘా పెరగడంతో ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం మీదుగా రవాణాను స్మగ్లర్లు ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

మండలంలో గతేడాది నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి ఇలాంటివి నాలుగు ఘటనలు జరిగాయి. వీటిల్లో దాదాపు 160 కేజీల సుమారు రూ.40,68,750 విలువ గల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ఇలాగే కొనసాగితే మండలం మరో గంజాయి కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి.

అక్రమ సంపాదనే ధ్యేయంగా..

అక్రమ సంపాదనే ధ్యేయంగా, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా కొంతమంది యువత ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు దొరుకుతుండగా మరికొంత మంది గట్టు చప్పుడు కాకుండా రవాణా సాగిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. మండలం మీదుగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ విక్రయిస్తున్నారు. గంజాయి వినియోగంలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వినియోగిస్తున్నారనే ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

మండలంలో గంజాయి బాబులు..

మండలంలోని కొన్ని గ్రామాల్లోని యువత గంజాయి సేవిస్తున్నారు. పర్ణశాల అడ్డ రోడ్‌తో పాటు లక్ష్మీనగరం గ్రామంలో సైతం గంజాయి బాబులు యథేచ్ఛగా గంజాయి సేవిస్తున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా వినపడుతున్నాయి. ఈ క్రమంలోనే విక్రయాలు సైతం సాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టినట్టు విశ్వసనీయ సమాచారం.

పోలీసుల ప్రత్యేక నిఘా..

గంజాయి రవాణా, వినియోగంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్న విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మండల పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీసుల నిఘా ఉన్నప్పటికీ కొంత మంది స్మగ్లర్లు మండలం మీదుగా గంజాయి రవాణాను కొనసాగిస్తున్నారు. మండల సరిహద్దు గ్రామాలైన కొత్తపల్లి, చెరుపల్లి గ్రామాలలో మరింత నిఘాను కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో 24 గంటలు పోలీసులు సరిహద్దు గ్రామాలలో ఉండే అవకాశాలు లేనందున పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

నిఘా కఠినతరం..



గంజాయి అక్రమ రవాణాపై నిఘాను తీవ్రతరం చేశాం. మండల సరిహద్దుల నుంచి గంజాయి బాబులు రవాణాకు ప్రయత్నించిన, మండలంలో గంజాయి విక్రయించిన, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయి రవాణా, విక్రయాలు కొనసాగించి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దు. మంచి మార్గంలో నడిచి నలుగురికి ఆదర్శంగా నిలవాలి. మంచి వాళ్లకు ఫ్రెండ్లీ పోలీసింగ్, కాని అక్రమార్కులకు మా పద్ధతిలో కౌన్సిలింగ్ ఇస్తాం. ప్రజలు గంజాయి రవాణాకు సంబంధించి సమాచారం ఉంటే తెలియపరచాలి.

– బి.అశోక్, దుమ్ముగూడెం సీఐ

'పేట'లో పెరుగుతున్న వినియోగం..

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో గంజాయి సేవించే వారు నానాటికీ పెరిగిపోతున్నారు. గడిచిన ఐదేళ్లుగా ఈ సంస్కృతి విపరీతంగా పెరిగిపోతోంది. వేల్పుల వెంకటేశ్వర్లు ఎస్ఐగా పనిచేసే రోజుల్లో గంజాయి సేవిస్తున్న యువకులను చాకచక్యంగా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు కూడా నమోదు చేశారు. అప్పట్లో గంజాయి కూడా స్థానిక యువత సేవిస్తున్నారనే వార్తలు రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. అప్పటినుంచి తరచుగా పోలీసులు పలుమార్లు గంజాయి సేవిస్తున్న వారిని.. రవాణా చేస్తున్న వారిని, విక్రయించే వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. కానీ నానాటికీ గంజాయి వినియోగం మాత్రం కట్టడి కావడం లేదు. ఇటీవల ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద పట్టపగలే గంజాయి సేవించి అటుగా వెళ్లే మహిళలను, పాఠశాల విద్యార్థినులను టీజ్ చేస్తున్నట్లు ఆప్రాంత వాసులు 'సాక్షి' దృష్టికి తీసుకురావడంతో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన పోలీసులు అక్కడకు ఎవరూ రాకుండా హెచ్చరించారు. సంత మార్కెట్ ఏరియా, భద్రాచలం రోడ్‌లో ఖాళీ గోడౌన్లు, ఖాళీ వెంచర్లు గంజాయి సేవించడానికి అడ్డాలుగా తయారు చేసుకున్నట్లు సమాచారం. నిత్యం రాత్రి 9, 10గంటల మధ్య ఖమ్మం రోడ్‌లో గంజాయి సేవిస్తున్న వాసన రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అశ్వారావుపేటలో ఫ్యాక్టరీలతోపాటు భవన నిర్మాణ పనులు, దాబాలు, రెస్టారెంట్లతోపాటు పలు ఇతర రంగాల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కూలీలు సుమారు 2వేల మంది వరకు పనిచేస్తున్నారు. వీరంతా గుట్కా, ఖైనీ నములుతుంటారు. కొందరు గంజాయి సేవిస్తుంటారని స్థానికులు చెబుతుంటారు. వీరిలో కొందరు తప్పు దారులు పట్టడంతోపాటు స్థానిక యువతకు గంజాయిని చిన్న పొట్లాలుగా విక్రయిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో అశ్వారావుపేటలో గంజాయి వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ముగిసిన రైతు భరోసా సర్వే


అశ్వారావుపేటలో సర్వే చేస్తున్న రెవెన్యూ, వ్యవసాయ అధికారులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రం అమలు చేయనున్న రైతు భరోసా పథకానికి సంబంధించిన సాగు భూముల గుర్తింపు సర్వే ఆదివారం ముగిసినట్లు స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఏఓ శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉన్న నాలుగు వ్యవసాయ క్లస్టర్లలలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా 130 సబ్ డివిజన్‌లలో మొత్తం 37,071 ఎకరాల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో 98.21 ఎకరాలలో రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లు, గృహ సముదాయాలు, పలు రకాల వ్యాపార సముదాలతోపాటు వ్యవసాయేతర భూములు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిలో అశ్వారావుపేటలో 32.72 ఎకరాలు, ఆసుపాకలో 40.55 ఎకరాలు, నారాయణపురంలో 12.10, మద్దికొండలో 7.06, గుంటిమడుగులో 1.10, నారంవారిగూడెంలో 3.07, వేదాంతాపురంలో 0.12, రామన్నగూడెంలో 1 ఎకరం చొప్పున మొత్తం 98.21 ఎకరాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించి నమోదు చేసినట్లు వివరించారు. దీనిపై సమగ్ర నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, ఏఈఓ సతీష్, షాకిరా భాను, నార్లపాటి రవీంద్ర ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారే, నాయకులు

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్లను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్యవైశ్య క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో ఆర్యవైశ్యుల పాత్ర గణనీయమైనదని అన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి రామభద్రం, మండవల్లి సురేష్, తాత శ్రీను, దారా ప్రసాద్, అక్కం సత్తిబాబు, చారుగుండ్ల ప్రదీప్, అడపా సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టనంలోని రాఘవ నిలయం(రెడ్డి సత్రం)లో రాఘవ నిలయ రెడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన జయంతి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. 15వ శతాబ్దానికి చెందిన ప్రజా కవి, గాయకుడు ఆధ్యాత్మికవేత్త వేమన ప్రజలు సన్మార్గంలో జీవించేలా విశ్వదాభి రామ వినరవేమ అనే పద్యాల రూపంలో తెలియజేశారని పేర్కొన్నారు. శివభక్తుడైన వేమన సుమారు 5 వేలకు పైగా పద్యాలను తెలుగులో అనుసంధానం చేసి అందరికి అర్థమయ్యేలా రచించిన మహానీయుడని కొనియాడారు. కార్యక్రమంలో గాదె మాధవరెడ్డి, రమణారెడ్డి, సుధాకర్ రెడ్డి, దారా బాలాజీ రావు, వీరయ్య, యశోద రాంబాబు, మధు, షేక్ అజీమ్, శ్రీధర్ రెడ్డి, విద్యాసాగర్, చలపతిరావు, నరేందర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1999–2001 సంవత్సరాల్లో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణాలో సమావేశమై ఆత్మీయ సమ్మేళం ఏర్పాటు చేసుకున్నారు.

కళాశాలలో చదువుకు 25 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారు ఒకరికొక్కరు ఆలింగనం చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులను కలయదిరుగుతూ అప్పటి మధుర స్మృతులను తలచుకున్నారు. ఈ సందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

మాలమహానాడు జిల్లా కన్వీనర్‌గా రమణమూర్తి



చర్ల: జాతీయ మాలమహానాడు జిల్లా కన్వీనర్‌గా చర్లకు చెందిన తోటమళ్ల రమణమూర్తి నియమితుడయ్యారు. జిల్లాలోని పాల్వంచలో జరిగిన మాలమహానాడు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ అశోద భాస్కర్ సమక్షంలో తోటమళ్ల రమణమూర్తిని జిల్లా కన్వీనర్‌గా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన జాతీయ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌కు, ఇతర రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జూలూరుపాడు అడ్డా ఆటోయూనియన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇనుముల పిచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా పోచం హనుమంతరావు, కోశాధికారిగా కాకటి జగన్నాధం, గౌరవ అధ్యక్షుడిగా రెడ్డిపోగు రవి, ప్రధాన కార్యదర్శిగా అన్వర్‌హుసేన్‌లను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువుకు వెళ్లే మార్గంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ వద్ద ఆదివారం రాత్రి మొండికుంట గ్రామానికి చెందిన వెంకన్న రహదారిపై కింద పడి గాయాలతో ఉన్నాడు. ఆ వైపు వెళ్తున్న స్థానికులు సీపీఐ నాయకుడు కమటం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ కు సమాచారం ఇవ్వగా వారు వెంటనే స్పందించి వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

రేపు లెనిన్ వర్ధంతి సభ

ములకలపల్లి: మార్కిస్ట్ దిగ్గజం లెనిన్ శతవర్ధంతి ముగింపు సభను విజయవంతం చేయాలని మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ పిలుపునిచ్చారు. సభ విజయవంతాన్ని కోరుతూ.. మండలపరిధిలోని తిమ్మంపేటలో ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ప్రజలు భారీగా తరలిరావాలని అన్నారు. మండల కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, పుప్పాల నాగేశ్వరరావు, గడ్డం వెంకటేశ్, చుక్కా శ్రీను, సోయం వెంకటేష్, కొర్సా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనను నాణ్యతతో నిర్మించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగుపై నిర్మిస్తున్న వంతెనను నాణ్యతతో నిర్మించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంట్రాక్టర్‌కు సూచించారు. తుమ్మలచెరువులో లోతువాగుపై వంతెన పనులను ఆదివారం ఎమ్మెల్యే పాయం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యతతో నిర్మించేలా చూడాలని సూచించారు. లోతువాగుపై వంతెన లేక ఎన్నో ఏండ్లుగా గిరిజనులు ఇబ్బందులు పడుతుండటంతో వంతెన నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేయించామని ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు గాదె కేశవరెడ్డి, రాగం మల్లయ్య, పర్వత నరేష్, స్థానికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం వారి నూతన సంవత్సరం–2025 క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అయ్యప్పస్వామి దీక్ష ముగించుకున్న సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు చల్లా వెంకటనారాయణ, నాయకులు తిరుపతి చంటిలు ఎమ్మెల్యే పాయంను కలిసి అయ్యప్పస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయంను వారు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బూర్గంపాడు: సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: పేదల వైద్యఖర్చులకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక చేయూతనందిస్తుందని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడులో ఆదివారం రూ 16.75లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 45మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందిన పేదలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థికసాయమందిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమం చేపడుతుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. నిరుపేదలకు తప్పకుండా ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాన్యుడిలా ఎమ్మెల్యే..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ఏరియా ఆస్పటల్ సెంటర్‌లోని ఆదివారం ఉదయం టిఫిన్ చేస్తూ కనిపించి తన కలివిడి తనాన్ని మరోసారి నిరుపించుకున్నారు. భద్రాచలం పట్టణంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయలుదేరిన ఆయన ఒక్కసారిగా ఆగి రోడ్డు ప్రక్కన ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద సామాన్యుడిలా అందరితో కలిసి టిఫిన్ చేశారు. ఎమ్మెల్యే తమతో టిఫిన్ చేస్తుండడంతో అక్కడి వారు అవాక్కయ్యారు. నలుగురుతో కలిసి ఉండడం, నలుగురితో తినడం వంటివి తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తాయని ఎమ్మెల్యే తెల్లం ఈ సందర్భంగా పేర్కొన్నారు.


అందరితో కలిసి టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

ఉచిత మెగా వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భద్రాచలం నేతాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని డాక్టర్ హేమంత్ కాకర్ల, డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 250 మంది ప్రజలు శిబిరానికి హాజరవగా.. అవసరమైన వారికి రూ.2500 విలువ గల ఎముకల సాంద్రత బీఎండీ పరీక్ష, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్ష, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎముకలు వైద్య నిపుణుడు డాక్టర్ హేమంత్ కాకర్ల మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం ప్రజలకోసం తక్కువ ఖర్చులో అధునాతన లాప్రోస్కోపీ వైద్య సేవలు, యాక్సిడెంట్, మోకాళ్ల కీళ్ల మార్పిడి వంటి ఆపరేషన్లు తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ వైద్యులు డాక్టర్ సుకన్య రెడ్డి, హాస్పిటల్ నిర్వహకులు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, నాయకులు ఆదివారం పలువురు కుటుంబాలను పరామర్శించారు. మొండికుంట గ్రామంలో తిప్పారెడ్డి వీరారెడ్డి, పసుల వెంకయ్య, మల్లెలమడుగు గ్రామంలో కుంజా శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, వేల్పుల మల్లికార్జున్, కోడి వెంకన్న, కొల్లు లింగారెడ్డి, కొల్లు ఆశ, కమటం వీరన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

దమ్మపేట: మండల పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన పలువురి భౌతిక కాయాలకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం నివాళులర్పించారు. మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన కారుమంచి సత్యావతి అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే.. మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాచారం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మస్కట్ల బజారమ్మ, తన్నీరు నాగమణి భౌతిక కాయాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, ఎల్లిన రాఘవరావు, చిన్నశెట్టి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం


కరాటే విద్యార్థులకు బెల్ట్ ధరింపజేస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బోధి ధర్మ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు ఆదివారం బెల్టులు, ప్రశంసాపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లు హాజరయ్యారు. విద్యార్థులు వారు నేర్చుకున్న కరాటే విద్యను ప్రదర్శించి అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థుల నైపుణ్యతకు అనుగుణంగా తహసీల్దార్ రాఘవరెడ్డి, సీఐ సతీష్‌కుమార్ చేతుల మీదుగా బ్లాక్, రెడ్, బ్లూ బెల్టులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోటు షికారుకు ఆదరణ


తుమ్మలచెరువులో పర్యాటకుల బోటు షికారు..

అశ్వాపురం: మండల పరిధిలోని కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువులో బోటు షికారుకు ఆదరణ పెరుగుతోంది. పర్యాటకుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తోంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో ఈ నెల 9న తుమ్మలచెరువులో బోటింగ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ నెల 10న 15 మందితో ప్రారంభమైన బోటింగ్ ప్రస్తుతం రోజుకు 100 నుంచి 150 మంది పర్యాటకులు తుమ్మలచెరువులో బోటింగ్ చేస్తున్నారు. తుమ్మలచెరువు గ్రామ పంచాయతీకి చెందిన డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో బోటింగ్ నిర్వహిస్తున్నారు. బోటింగ్‌కు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30 తీసుకుంటున్నారు. రోజుకు రూ.5వేల నుంచి 9 వరకు ఆదాయం వస్తోంది. మండలంలోని గ్రామాల ప్రజలు, చుట్టూ ప్రక్కల మండలాల ప్రజలు తుమ్మలచెరువును సందర్శించి బోటు షికారు చేస్తున్నారు. కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు చెరువు కట్టపై పురాతన ఆంజనేయస్వామి ఆలయం, వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటంతో ప్రకృతి అందాలు చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. చెరువు వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. తుమ్మలచెరువు వద్దకు రహదారి సౌకర్యం లేకపోవటంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి సౌకర్యం లేక పర్యాటకుల సంఖ్య తగ్గుతోంది. రహదారి సౌకర్యం కల్పించాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.